# పిదపకాలం

## —— కౌకొని కమల

మసక చీకట్లు ముసురుతున్నాయి. గుడిసెలో ఇంకా దీపం బుడ్డి వెలిగించలేదు. నులకమంచంలో ముసగదీసుకుని పడుకున్న మంగవ్వ అసహనంగా అటుఇటు కదులుతూ మూలుగుతుంది. మనుమరాలు 'సెంద్రి' వూరిశివర మోటబాయికి పోయి నీళ్ళు తెత్తనని బుంగదీసుకుని వెళ్లి పావుగంట అవుతుంది. ఇంకా రాలేదు.

వాళ్లగూడెంలోని బాయి, నీళ్ళకుంటలు అన్ని ఎండిపోయినయి. సర్కారోళ్ళు వేసిన బోరింగ్ పాడై శానా దినాలు అయ్యింది. ప్రతిఏటా ఆ గూడెంకి నీటిఎద్దడి వేసవి కాలానికి ముందే మొదలవుతుంది. ఇప్పుడు ఆ గూడెం మొత్తానికి నీటి ఆధారం నాలుగు కోసుల దూరంలో వున్న ఊటబావే. ఆ కుంటలోంచే నీళ్లు తెచ్చుకుంటారు.

ఆ ఊటబాయి వెనకనుంచి చిట్టడివి మొదలవుతుంది. పట్టపగలే ఆ చుట్టుముట్టుల వెలుగు జొరక జిదారువాంటుంది. వింతవింత ధ్వనులు ఆ చెట్లలోంచి వినిపిస్తాయి. ఆ చెట్లలోంచి ఏ సమయంలో అయినా చిన్నాచితక జంతువులు మీద పడవచ్చు. అందుకే గూడెంలోని జనం నీళ్ళకి వెడితే ఒకరికొకరు పిల్చుకొని జట్లుజట్లుగా వెడతారు. ఎంతటి మగాడికైనా ఒక్కడు వెళ్లాలంటే జంకే.

ఆ గూడెం జనం అంత కూలినాలి చేసుకునే వాళ్లే.

చీకట్లతోనే లేచి తట్టలు, పారలు, గునపాలు తీసుకుని కూళ్ళకి పోతారు.

సాయంత్రం పొద్దుమీలిగే వేళకి ఇళ్లు చేరతారు.

ఇంక అప్పుడు కుండలు తీసుకుని నీళ్లకి వెళతారు.

అక్కడే స్నానాలు, గుడ్డలు ఉతుకుడులాంటి పన్లు కానిచ్చుకుని ఆ మర్నాటికంత అవసరం అయ్యే నీళ్లు మోసి తెచ్చుకుంటారు.

వాళ్ళతోపాటే సెంద్రికూడా బుంగ తీసుకుని వెళ్ళింది. ఇంట్లో ఒక్క చుక్క నీళ్లు లేవు.

మంగవ్వకి ఆ పొద్దునుంచి గొంతుక ఎండిపోతుంది. అంగిడి ఆర్చకపోతుంది దాహంతో.

మంచం దిగలేదు. మంగవ్వకి నడుం విరిగి ఏడాది కావస్తుంది. ఏదో మాయదారి రోగంవచ్చి నడుం పడిపోయింది. అప్పట్నుంచి మంచం పట్టింది. మంచం దిగలేదు.

అటొకరు, ఇటొకరు భుజాలు ఎత్తి బలమైన ఆసరాఇస్తే ఎలాగో మంచం దిగి నేలమీద దేకుతుంది. బయటకి పోవలసివప్పుడు ఎలాగో అలాగే అవస్థపడి వెళ్లివస్తుంది. అంతే. మిగతా కాలం అంతా మంచంమీదే.

కాళ్లు, చేతులు బాగానే ఆడతాయి. కాని నడుం చచ్చుబడడంతో నిలబడలేదు. తిన్నగా కూర్చోలేదు. అందుకే మనుమరాల్ని తెచ్చి పెట్టుకుంది.

గుడిసెలో చీకట్లు ముసురుతున్నాయి.

"చిమ్నిని తుడిసిందో లేదో ఈ సెంద్రిముండ. బుడ్డిలో గానునూనె వుందో లేదో... ఆ జాము వంగ బుంగ దీస్కనిపోయింది. పోగనుగత్తెల్తో అడ జలకాలాడతందో ఏమో! సావసగత్తెల్తో చేరితే ముండకి కొంపగ్యాపకం వుండదా........"

మంగమ్మ సణుక్కుంటూ మంచంలో పొర్లింది.

గుడిసెలో ఎవరూ లేరు.

మంగవ్వకి దూపయితుంది. నీటిసుక్కకోసం దవడలు ఆర్చకపోతున్నాయి. నాలిక చప్పరించి గుటక ఏసినా ఉమ్మిగూడా తగలడం లేదు. దానికితోడు దీపం ఎలిగించక గుడిసెంత ముసురుతున్న సీకటి.... సూపుకానరాని సీకటి....

మంచంలో పడుకొనే వుండివుండి గొంతంత తెరిచి అరుస్తుంది.

"ఒసేయ్ సెంద్రిముండా ఏడనచ్చావే. గుడిసెలో సిమ్మి అన్న ఎలిగించకాండా పోతివి" అని మనవరాల్ని శాపనార్ధాలు పెడుతూనే ఇగలాభం లేదని–

"ఓ మైసమ్మా... ఓ లచ్చమ్మా... ఎవురమ్మా... ఎవురన్నా వుంటే ఓ పాలిటురండే తల్లి. నా గొంతుక ఆర్చకపోతుంది. ఓ వురిసిడు నీల్లన్న నా గొంతుకలో పొయ్యండే తల్లి నా పానం నిలవడం లేదే తల్లి... నీల్లు తాగకపోతే నా సావు కల్లపడుతుందే అమ్మా......" అంటూ ఇరుగుపొరుగుల్ని పిలవబట్టింది.

కాని ఎవ్వరూ పలకలేదు.

"ఎవ్వరూ సప్పుడు సెయ్యరేవే అమ్మా... గూడె పోల్లంత ఏడనన్నా నాశనం అయినారే..." అని వీళ్లిఒర్లాతుంది. ఆ గూడెంలో అందరూ రెక్కలు విరుచుకుని కూలిపన్లు చేసుకుని బతికేవాళ్ళే.

ఇంకా కొంతమంది అసలు ఇళ్లకే రాలేదు.


వచ్చిన వాళ్లు ఆడ–మగ ఊరి చివరకు నీళ్ళకి పోయివుంటారా.

నీళ్లులేకుండా ఏ పన్లు జరుగుతాయి?

గూడెం అంత నిశ్శబ్దంగా వుంది. సడి సప్పుడు లేదు.

అయిన ధూపుతో ఆర్చకపోతున్న గొంతుతో మంగమ్మ నీళ్లకోసం మంచంలోంచి అరుస్తూనే వుంది.

"ఒసేయ్ సెంద్రి... ఓ మైసమ్మా... ఎవురే




### అంతా పుకారంటున్న శక్తికపూర్

ఈమధ్య ఒక రోజు శక్తికపూర్ ఒంటిమీద బట్టల్లేకుండా తన అపార్ట్‌మెంట్‌లో నానా అల్లరి చేసేశాడని వచ్చిన వార్తల్ని చూసి అది నిజమా? కాదా? అని అడిగితే, గొడవ జరిగిన మాట నిజమేననీ, తర్వాత ఆ కాలనీవాళ్ళందరూ క్షమాపణలు చెప్పారనీ అన్నాడు. కానీ తను నగ్నంగా తిరగడం మాత్రం ఒట్టి పుకారని కొట్టిపారేశాడు.

తల్లి.... ఎవురన్నా ఓ పాలిటిరాంగ్రిడి... వా పావం విలువుంద్రి... ఓ వురిసిదు నీళ్లు వా గొంతకలో పోయ్యింగ్రి....."

మంచంలోంచే అరుస్తుంద.

ఆ ముసురుతున్న చీకటి తెరల్లోంచే కళ్లు ?కిలించుకుని గుడిసె గవాక్షంవైపు చూస్తుంది.

అంతలో తలువు దగ్గర శబ్దం అయ్యింది.

"చంద్రక్కాయ్... బొంగరం ఆడుకుందాం దా..."

తలువు దగ్గర పిలువు వినిపించింది.

ఆ పిలువువిన్న మంగవ్వ ప్రాణం లేచివచ్చింది.

"ఉరేయ్... ఎవుడ్రా ఆదు.. ఎంకన్నేనా?"

"అవునే మంగవ్వా" తూనీగలా ఆరేళ్ల వెంకన్న గుడిసెలోకి దూకుతూ వచ్చాదు.

"సెంద్రక్కలేదా? ఆడుకోవాలే......" అరచేతి లోనే బొంగరాన్ని గిర్రున తిప్పాదు.

మంగవ్వ మంచంలోంచే ఒంగి గభాల్న ఆ పిల్లగాడి చెయ్యి దొరకబుచ్చుకుంది.

"ఉరేయ్... సెంద్రిలేదురా. నీళ్లుతేమ బుంగి ఎత్తుకొని బాయికి పోయిందిగానీ... ఉరేయ్... ఓ పిన్నపని చేసి పెడతావ్... వచ్చి నీ కదువున వుడతారా అయ్యా...."

"సెప్పే అవ్వా"

"ముందు ఆ గూట్లో సిమ్మి, అగ్గిపెట్టె వున్నాయి కాని జర్రంత దీపం ఎలిగించి ఇసింట పెడతావురా అయ్యా"

"ఆ..."

ఎంకన్న బొంగరం నిక్కరు జేబులో పెట్టుకుని జాగ్రత్తగ దీపం ఎలిగించి ముసలమ్మ మంచం పక్కన వున్న ముక్కాలి పీటమీద పెట్టాదు.

దీపం చిన్నదయినా చీకట్లు తొలగి గుడిసంత వెలుగువచ్చింది.

మంగమ్మ మంచంలోంచే చేతులు జోడించి కళ్లు మూసుకుని దీపానికి దండం పెట్టుకుని లెంపలు వాయించుకుంది

"ఉరేయ్... ఎంకన్నకొండా. ఇటు రారా..."

"ఏంటవ్వా?" "ఇంకొక్క పిన్న పనిసేసి పెడ తావురా. సెంద్రి వచ్చినంక నీకో బెల్లంముక్క పెట్టిపిస్తా..."

"చెప్పే అవ్వా" మళ్ళి జేబులోంచి బొంగరం తీసి అరచేతిలో ఆడించడం మొదలుపెట్టాదు.

"ఉరేయ్ నాయనా! ఆ పొద్దునుంచి దూపయి నా గొంతుక ఎండకపోతుందిరా. దాహంతో పిడస ఎన్కపోతందిరా. పావం ఎల్లిపోతుందేమో... మీ ఇంట్లోంచి ఓ గిలాసదు మంచితీర్థం తెచ్చి ఇస్తా వురా. కాసింత గొంతు తదువుకుంట..."

"మంచి తీరతమా!?"

"అవురా. ఆ సెంద్రిముండ తక్కుతూ తారుతూ ఎప్పటికి అస్తందో ఏమో..."

"మరి సెంద్రక్క వచ్చినంక నాకా బెల్లంముక్క పెట్టిపిస్తావా?"

"ఆ... బెల్లం ఎందు కొబ్బరికూడా పెట్టిస్తా. మరిమువ్వు గిలాసదు తీర్థం తెచ్చి నా గొంతుకలో పోస్తేనే... ఆ..."

"ఓ! ఇప్పడే తెస్తా" ఎంకన్న బొంగరంలా వాల్లిం టికి పరిగెత్తాదు.

ఐదు నిమిషాలుకూడా గడవకముందే చిన్న వత్తు గిలాప అవురూపంగా జాగ్రత్తగా రెండు చేతుల్తో పట్టుకుని గుడిసెలోకి వచ్చాదు.

"ఇంగోనే అవ్వ! గిలాసనిండా దెచ్చినా... మా గుడిసెలో ఎవ్వరూ లేరు. అందుకే పాటుగా తెచ్చిన..."

మంగవ్వ ప్రాణం లేచి వచ్చింది.



"ఉరేయ్ ఎంకన్నా! మడిసి సేతి ఆసరా లేకుండా నే లేసి కూసోలేనుగాని ఎళ్లకిలా పండత. జర్రంత ముక్కకూడా కింద ఒలక్కుండా నా నోట్లకెల్లి పోస్తవురా"

అంటూ వెల్లకిలా పదుకుని బోసినోరంతా దాకలా బార్లా తెరిచింది.

ఆరేళ్ల ఎంకదు గ్లాసుని జాగ్రత్తగా రెండు చేతుల్తో పట్టుకుని అవురూపంగా తీర్థం మంగవ్వ నోట్లోకి ధారగా పోశాదు.

రెండు గుక్కెళ్లు తాగి గుటక మింగిందో లేదో 'థుప్'మని శబ్దం వచ్చింది.

మంగవ్వ నోటినిండా వున్న ద్రవం అంత బయ టికి ఉమ్మింది.

గొంతుకంత భుగభుగ మండిపోతుంటే మిరప కాయ తిన్నకాకిలా లబలబలాడింది.

"ఓరి నీ బుద్ధి కాష్ఠంలో పెట్ట. గిలాసదు మంచితీర్థం తెమ్మంటే కావుసారా తెచ్చి నా నోట్ల పోస్తివేందిరా నంగి ఎధవా... నీ సేతులిరగా... నీ తోలుతియ్యా... లండికొడక...."

ముసలమ్మ తిట్లకి ఎంకన్న భయంగా చేతులో గ్లాసు కిందపడేశాదు.

"నువ్వే గదే అవ్వా. మంచితీరదం తెమ్మన్నది?"

"అవురా. మంచితీరదం అంటే ఇదిరా లండికొ డకా..."

అంతకంట పెద్దగా గయ్యిమన్నదు ఎంకదు.

"గిదేమరి.... మా నాయన దీన్నే మంచితీరదం అంటదు. తీరదం తాగకుంటే నీ లెక్కనే మా నాయనకికూడా నాలిక పీక్కపోతుందిట. గొంతుక ఎండక పోతుందిట. గిలాసదన్న నిత్తెం ఇది తాగ కుంటే మా నాయన పానం కడగడతందంట. ఈ తీరదం తాగకుంటె మా నాయన బతకలేడంట. సావు కల్లబడతుందంట. అందుకే నూకలు కొన్న కొనక పోయిన దీన్ని కొనక్కస్తడంట. దినాం మా యమ్మతో లొల్లి పెట్టుకొంటదు. మరి నువ్వు గిలాసదు తీరదమే గదే తెమ్మంటివి అవ్వా...."
ఎదురు ప్రశ్నవేశాదు ఎంకదు.

దాహం తీరలేదు సరికదా గొంతుకంత భగ్గున మందుతుంటే మంగవ్వ శాపనార్థాలు పెదుతూ ఎంకన్నని కొడతానికన్నట్లు చెయ్యి ఝాడించింది.

కాని–

అప్పటికే ఎంకన్న గుడిసెలోంచి బయటికి పరిగె త్తాదు.